క్లుప్తంగా

'స్పందన'లో మూడు అర్జీలు



గంపలగూడెం: గంపలగూడెం తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో మూడు అర్జీలు వచ్చాయని ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి తెలిపారు. తహసీల్దార్ జి బాలకృష్ణారెడ్డి, ఏఓ బి.సాయిశ్రీ, గృహ నిర్మాణ శాఖ ఏఈ కిషోర్ పాల్గొన్నారు.

అర్జీలు గడువులోగా పరిష్కరించాలి



నూజివీడు: స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పరిష్కరించడంలో ఎలాంటి అలసత్వం వద్దని, గడువులోగా సంబంధిత అధికారులు పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్పందనలో ప్రజల నుంచి వివిధ సమస్యలపై ఎనిమిది అర్జీలు అందాయి. స్పందనలో డీఎల్‌పీఓ పి.వెంకటరత్నం, ఆర్‌అండ్‌బీ డీఈ బాబూరావు, విద్యుత్ ఏఈ వీరబాబు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం

మైలవరం: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మైలవరంలోని గ్రామ సచివాలయం-4 పరిధిలోని దేవుని చెరువు వద్ద నుంచి మంగళవారం ఉదయం ఏడు గంటల నుంచి తిరిగి సాయంత్రం నాలుగు గంటల నుంచి నిర్వహించనున్నట్లు పార్టీ పట్టణ అధ్యక్షుడు పాలా నారాయణరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ పాల్గొంటారని పేర్కొన్నారు.

జాతీయ పోటీలకు మైలవరం విద్యార్థి ఎంపిక

మైలవరం: జాతీయ విశ్వ విద్యాలయాల సాఫ్ట్ బాల్ పోటీలకు మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీఏ ద్వితీయ సంవత్సరం విద్యార్థి పి.మున్న ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి తెలిపారు. మైలవరం కళాశాలలో సోమవారం ఆయన మాట్లాడుతూ నున్నలోని వికాస్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో రెండు రోజులు జరిగిన కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల పోటీలలో తమ కళాశాలకు చెందిన విద్యార్థి ఎంపికయ్యాడని తెలిపారు. ఈ నెల 5వ తేదీ నుంచి చండీగఢ్‌లోని పంజాబ్ విశ్వ విద్యాలయంలో నిర్వహిస్తున్న అఖిల భారత అంతర్ విశ్వ విద్యాలయాల సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్‌లో కృష్ణా యూనివర్సిటీ తరపున ప్రాతినిధ్యం వహిస్తాడని కళాశాల ఫిజికల్ డైరెక్టర్ మేజర్ మన్నేస్వామి తెలిపారు. ఎంపికై న విద్యార్థిని ప్రిన్సిపాల్ డాక్టర్ రవి, ఫిజికల్ డైరెక్టర్ మేజర్ మన్నేస్వామి అభినందించారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

రెడ్డిగూడెం: అభ్యుదయ యువశక్తి సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరం నందు వైద్యులు చింతిరాల ఫ్లారెన్స్ పాల్గొని కంటి సమస్యలతో బాధపడుతున్న 40 మందికి కళ్ల పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఏడుగురికి కంటిలో శుక్లాలు, కంటి పొరలు గుర్తించి శస్త్రచికిత్స నిమిత్తం విజయవాడ చైతన్య కంటి ఆస్పత్రికి రిఫర్ చేశారు. సంఘ సెక్రటరీ చింతిరాల సావిత్రి, కోశాధికారి తాలూరి ఝాన్సీ పాల్గొన్నారు.

ఎండిపోయిన చెట్లు తొలగింపునకు వేలం

విస్సన్నపేట: విద్యుత్తు లైన్‌కు విఘాతంగా ఉన్న ఎండిపోయిన, వరిగిపోయిన చెట్లు తొలగించేందుకు స్థానిక ఎస్‌ఎస్‌ఎల్ బీసీ ఉపకార్య నిర్వాహక ఇంజినీరు, ఓఅండ్‌ఎం ఉపవిభాగం కార్యాలయ ప్రాంగణంలో సోమవారం బహిరంగ వేలం నిర్వహించినట్లు డీఈ రుద్రనరసింహా అప్పన్న తెలిపారు. కార్యాలయం ముందు ఉన్న విద్యుత్ తీగలకు సమీపంలో ఉన్న ఎండిపోయిన చెట్లు తొలగించుటకు హెచ్చు పాటపాడిన వారికి వాటిని తొలగించే అవకాశం కల్పించనున్నట్లు డీఈ పేర్కొన్నారు.

ఉపాధి పనులు ప్రారంభం

జి.కొండూరు: మండల పరిధి చెవుటూరులో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను సర్పంచ్ పిన్నిబోయిన శ్రీదేవి, వైస్ ఎంపీపీ పుప్పాల సుబ్బారావు సోమవారం ప్రారంభించారు. సర్పంచ్ మాట్లాడుతూ ఉష్ణోగ్రతల తీవ్రత పెరుగుతున్న క్రమంలో కూలీలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

200 పని దినాలు కల్పించాలి

చాట్రాయి: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకంలో 200 రోజుల పని దినాలు కల్పించాలని అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి దుర్గం పుల్లారావు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉపాధి కూలీలతో నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఎంపీడీవో ఎస్.మురళీ మోహనరావుకి వినతి పత్రం అందజేశారు.

మొదటి రోజు ప్రశాంతం

పదో తరగతి పరీక్షలకు పటిష్ట బందోబస్తు



ఇబ్రహీంపట్నం సెయింట్ జేవియర్ కేంద్రంలో పరీక్షకు వెళుతున్న విద్యార్థులు



నూజివీడు లోని సెయింట్ మేరీస్ స్కూల్లో పది పరీక్షలు రాసేందుకు వచ్చిన విద్యార్థులు



గంపలగూడెం హైస్కూల్లో రూమ్ నంబర్లను చూసుకుంటున్న విద్యార్థులు

మైలవరం: మైలవరంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. మండలంలో 1,169 మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 1,150 మంది హాజరయ్యారని మండల విద్యాశాఖాధికారి కార్యాలయం తెలిపింది. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఏసీపీ ఎం. రమేష్, ఎస్సై రాంబాబు కేంద్రాలను పరిశీలించారు. విద్యార్థులు ఉదయం తొమ్మిది గంటలకే కేంద్రాల వద్దకు చేరుకున్నారు. తల్లిదండ్రులు కొందరు తమ పిల్లలతో కేంద్రాల వద్దకు వచ్చి తగు సూచనలు ఇచ్చి వెళ్లారు.

తిరువూరులో..

తిరువూరు: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 958 మంది పదో తరగతి విద్యార్థులు తొలి రోజు పరీక్షకు సోమవారం హాజరయ్యారు. తిరువూరులోని సెంట్ ఆన్స్ స్కూల్, విజన్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, శ్రీనిధి స్కూళ్లలో పరీక్షా కేంద్రాలను కేటాయించినట్లు ఎంఈఓ రామకృష్ణ తెలిపారు.

ఆగిరిపల్లిలో..

ఆగిరిపల్లి: పది పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఆగిరిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో, ఎస్ఎఫ్ఎస్ హైస్కూల్‌లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 601 మంది విద్యార్థులకు గాను రెండు పరీక్ష కేంద్రాల్లో ముగ్గురు చొప్పున గైర్హాజరైనట్లు పది పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్లు శారద, పుష్పలత తెలిపారు.

నూజివీడులో..

నూజివీడు: నియోజకవర్గ పరిధిలోని 15 పరీక్ష కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు నిర్వహించిన తెలుగు పరీక్షకు 3,299 మందికి 3,251 మంది హాజరయ్యారు. 48 మంది గైర్హాజరయ్యారు. వేసవికాలం దృష్ట్యా విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేశారు. మంచినీటి వసతి, ప్రతి రూంకి బెంచీలు ఏర్పాటు చేయడంతో పాటు, గదులలో ఫ్యాన్లు ఏర్పాటు చేశారు.

ముసునూరులో..

ముసునూరు: మండలంలో 580 మంది పదో తరగతి విద్యార్థులు తొలిరోజు తెలుగు పబ్లిక్ పరీక్షకు హాజరైనట్లు ఎంఈఓ పి.రత్నకుమార్ తెలిపారు. ముసునూరు కేంద్రంలో నూరు శాతం విద్యార్థులు హాజరు కాగా, చెక్కపల్లి కేంద్రంలో ఆరుగురు, గోపవరం కేంద్రంలో తొమ్మిది మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు.

గంపలగూడెంలో..

గంపలగూడెం: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు గంపలగూడెం మండలంలో సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. విద్యార్థులకు తల్లిదండ్రులు ధైర్యం చెబుతూ కేంద్రాల వద్ద కనిపించారు. మొదటి పరీక్ష కావడంతో పరీక్ష పూర్తయ్యే వరకు తల్లిదండ్రులు కేంద్రాల వద్దే ఉన్నారు. మండలంలో 854 మంది విద్యార్థులకు ఐదు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎస్సై వి. సతీష్ పర్యవేక్షణలో పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు.

18 మంది గైర్హాజరు

విస్సన్నపేట: పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు 18 మంది విద్యార్థులు గైర్హాజరు అయినట్లు ఎంఈఓ చదల రామకృష్ణ తెలిపారు. విస్సన్నపేటలో ఐదు పరీక్ష కేంద్రాల్లో పదోతరగతి పబ్లిక్ పరీక్షలు నిర్వహించగా 1,044 మంది విద్యార్థులకు గాను 1,026 మంది హాజరయ్యారని ఎంఈఓ తెలిపారు.

ఆరుగురు గైర్హాజరు

చాట్రాయి: మండలంలో నిర్వహిస్తున్న పదో తరగతి పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా జరిగాయి. చాట్రాయి జెడ్పీ హైస్కూలు పరీక్ష కేంద్రంలో 223 మందికి 219 మంది పరీక్షలు రాయగా నలుగురు గైర్హాజరయ్యారు.

జి.కొండూరులో..

జి.కొండూరు: పదో తరగతి పరీక్షలు మొదటిరోజు ప్రశాంతంగా ముగిశాయి. మండల పరిధిలో ఈ పరీక్షలకు నాలుగు కేంద్రాల్లో 757మంది విద్యార్థులు హాజరవ్వాల్సి ఉండగా, ఎనిమిది మంది గైర్హాజరైనట్లు ఎంఈఓ పి.వెంకటనర్సింహారావు తెలిపారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: మండలంలో పదోతరగతి పరీక్షల నిమిత్తం గుంటుపల్లిలో 3, కొండపల్లి 3, ఇబ్రహీంపట్నం 1, మూలపాడు 1 మొత్తం ఎనిమిది పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 1,477 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావల్సి ఉండగా 1,465మంది హాజరయ్యారు. 12 మంది గైర్హాజరయ్యారు.

రెడ్డిగూడెంలో..

రెడ్డిగూడెం: మండలంలో సోమవారం జరిగిన పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. రెడ్డిగూడెం సెంటర్లో 116 మందికి గాను 115 మంది, రంగాపురం కస్తూర్బాగాంధీ పాఠశాల్లో 147 మందికి గాను 144 మంది, బీఆర్ అంబేద్కర్ గురుకుల కళాశాల్లో 150 మందికి 150 మంది హాజరయ్యారు.

'కంచి'కి ఎమ్మెల్యే నివాళి



తిరువూరు: ఏపీ మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ కంచి రామారావు నిస్వార్థంగా సేవలందించారని తిరువూరు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి అన్నారు. సోమవారం సాయంత్రం కంచి రామారావు నివాసగృహానికి వెళ్లిన ఎమ్మెల్యే ఆయన పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, నంబూరి శ్రీనివాసరావు, ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ వైస్ చైర్మన్ రేగళ్ల మోహనరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రామచంద్రారెడ్డి, లోకేశ్వరరెడ్డి, నడిం తిరువూరు పీఏసీఎస్ చైర్మన్ గజ్జల సీతారామారావు తదితరులు కంచి రామారావు మృతికి సంతాపం తెలిపారు.

విశ్వబ్రాహ్మణులకు సేవా కార్యక్రమాలు

తిరువూరు: మండలంలోని విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టాలని సోమవారం జరిగిన కార్యవర్గ సమావేశంలో నిర్ణయించారు. సంఘ అధ్యక్షుడు చామర్తి రాంబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ మేరకు తీర్మానించారు. కమ్యూనిటీ హాలు నిర్మాణం, శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ నిర్మాణ పనులకు స్థల సేకరణ, సంఘ పరిపుష్టికి తీసుకోవలసిన చర్యలపై సమావేశంలో చర్చించారు. విశ్వ బ్రాహ్మణ సంఘ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కూర్మాచార్యులు, శ్రీనివాసా చారిటబుల్ ట్రస్టు కన్వీనర్ కటకం శ్రీనివాసాచారి, తిరువూరు సంఘ ప్రధాన కార్యదర్శి బ్రహ్మాచారి, గౌరవ సలహాదారు ఆర్ఆర్‌కే చారి పాల్గొన్నారు.

రమణక్కపేటలో సమస్యలు పరిష్కరించాలి



సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్‌కు సమస్యలు వివరిస్తున్న వైఎస్సార్‌సీ పీ నాయకులు

నూజివీడు: ముసునూరు మండలంలోని రమణక్కపేటలోని సమస్యలను పరిష్కరించాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మూల్పూరి నాగవల్లేశ్వరరావు (నాని), గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్‌ను కోరారు. ఈ మేరకు వారు సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ రమణక్కపేటకు చెందిన గ్రామస్తులు గత 90 ఏళ్లుగా రెవెన్యూ భూములను సాగు చేసుకుంటూ మామిడి తోటలు, ఇతర పంటలు వేసుకుని జీవిస్తున్నారన్నారు. ఈ గ్రామానికి చుట్టూ అటవీ భూమి ఉందని, రెవెన్యూ భూమికి, అటవీ భూమికి సరిహద్దు లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నందున రెవెన్యూ, అటవీశాఖ అధికారులు కలిసి జాయింట్ సర్వే నిర్వహించి సరిహద్దులు నిర్వహించాలని కోరారు. గ్రామంలో 69 మంది పేదలకు పట్టాలు ఇచ్చారు గాని, స్థలాలను చూపలేదని, ప్రైవేటు భూమి అయినా కొనుగోలు చేసి వారికి నివేశన స్థలాలను చూపాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు నామముల లక్ష్మయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు రంగు గాంధీ, రంగు సత్యం పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆసరా వారోత్సవాలకు ఆహ్వానం



నూజివీడులో బొట్టుపెట్టి ఆహ్వానిస్తున్న మెప్మా ఆర్పీలు

నూజివీడు: పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల నాల్గో తేదీన నిర్వహించే వైఎస్సార్ వారోత్సవాల సభకు స్వయం సహాయక సంఘాల సభ్యులందరూ పాల్గొనాలని కోరుతూ పట్టణంలో మెప్మా ఆర్పీలు ఇంటింటికీ వెళ్లి బొట్టుపెట్టి ఆహ్వానిస్తున్నారు. వైఎస్సార్ ఆసరా మూడో విడతలో భాగంగా నూజివీడులో 662 సంఘాల్లోని 6,385 మంది సభ్యులకు రూ.6.79 కోట్లను ప్రభుత్వం వారి ఖాతాలకు జమచేసింది. ఈ నేపథ్యంలో ఉదయం పది గంటలకు నిర్వహించే కార్యక్రమంలో ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ముఖ్యఅతిథిగా పాల్గొననున్నారు. నూజివీడు మండలానికి సంబంధించి 1,527 సంఘాల్లోని 15,967 మంది సభ్యులకు రూ.15.49 కోట్లు మహిళల ఖాతాలో ప్రభుత్వం జమచేసింది. మండలానికి సంబంధించిన వారోత్సవాల సభ మధ్యాహ్నం మూడు గంటలకు నిర్వహిస్తున్నట్లు ఏరియా కో–ఆర్డినేటర్ దయాల రాజశేఖర్ తెలిపారు.

జెడ్పీటీసీ సభ్యుడు ప్రతాప్‌కు అభినందనలు



జెడ్పీటీసీ సభ్యుడు ప్రతాప్‌ను సన్మానిస్తున్న నాయకులు

ముసునూరు: ఒక వైపు 15 ఏళ్లుగా విద్య, సామాజిక, సాంస్కృతిక రంగాల్లో సేవలందిస్తూనే, మరో వైపు జెడ్పీటీసీగా మండల గ్రామ సచివాలయాల కన్వీనర్‌గా విజయవంతంగా పని చేస్తూ, ఇటీవల గౌరవ డాక్టరేట్‌కు ఎంపికైన ముసునూరు జెడ్పీటీసీ సభ్యుడు వరికూటి ప్రతాప్‌ను పలువురు అభినందించారు. జిల్లా వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ అధ్యక్షుడు పిళ్లా చరణ్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ కాట్రేనిపాడు గ్రామ అధ్యక్షుడు కంబాల రాంబాబు అధ్యక్షతన లోపూడి ఆశ్చర్య పాఠశాలలో నూజివీడు పట్టణ కౌన్సిలర్లు సోమవారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నూజివీడు పట్టణ కౌన్సిలర్లు కె.ఆదినారాయణ, కొమ్ము వెంకటేశ్వరరావు, తలారి సతీష్, అరికోటి ప్రసాద్, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు పి.జోజి, ఉదయగిరి ట్రస్ట్ అధినేత కృపారావు, నేతలు డోలా రామకృష్ణ, కంబాల దాసు పాల్గొన్నారు.

కనులపండువగా పుష్పయాగం



కోదండరామునికి పుష్పయాగం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్‌లోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం ప్రాంగణంలోని శ్రీ కోదండరామస్వామి ఆలయంలో స్వామివారికి సోమవారం పుష్పయాగం నేత్రపర్వంగా నిర్వహించారు. ఆలయంలో జరుగుతున్న స్వామి వారి కల్యాణ బ్రహ్మోత్సవాలు పురస్కరించుకొని సోమవారం పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిపారు. ఈ సందర్భంగా ఉదయం సీతాలక్ష్మణ, ఆంజనేయ సమేత శ్రీ కోదండరాముని ఉత్సవమూర్తులకు తిరుమంజనం చేశారు. వివిధ ఫల, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించి ఉత్సవమూర్తులను రమణీయంగా అలంకరించారు. అనంతరం వివిధ పుష్పాలతో యాగం చేశారు. గులాబి, లిల్లీ, చామంతి, మల్లి, మరువం, తులసి తదితర పుష్పాలతో స్వామి వారికి పుష్పయాగాన్ని అర్చకులు కొనసాగించారు. స్వామి వారి విష్ణు సహస్రనామం, శ్రీరామ మంత్రాలను పఠించారు. ఆగమ పండితులు పర్యవేక్షణలో పులిపాక రాఘవాచార్యులు, ఆంజనేయాచార్యులు వైదిక కార్యక్రమాలు నిర్వహించారు.

అంగన్‌వాడీ కేంద్రాల పనివేళల మార్పు

నూజివీడు: ఎండలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 4వ తేదీ నుంచి మే 31వరకు అంగన్‌వాడీ కేంద్రాల పనివేళలను మార్చినట్లు ఐసీడీఎస్ నూజివీడు సీడీపీఓ ఎస్వై నూరాణి సోమవారం తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలు ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించాలని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలి



మైలవరం: రోడ్డు ప్రమాదాలు నివారణకు వాహనదారులు సహకరించాలని మైలవరం ఎస్సై పి. రాంబాబు తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా మైలవరంలో తరచూ ప్రమాదాలు జరిగే స్పాట్‌లను ఎస్సై తన సిబ్బందితో కలిసి సోమవారం పరిశీలించారు. ఇందులో భాగంగా వేగ నియంత్రణ కోసం జాతీయ రహదారిలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యల్లో భాగంగా స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో బారికేడ్లు ఏర్పాటు చేయించారు.

క్రీడాపోటీల్లో ఎల్బీఆర్‌సీఈ విద్యార్థినుల ప్రతిభ



మైలవరం: జేఎన్‌టీయూకే, కాకినాడ సెంట్రల్ జోన్ బాస్కెట్ బాల్ పోటీల్లో మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల మహిళల జట్టు రన్నర్స్‌గా నిలిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు సోమవారం తెలిపారు. గత నెల 31 నుంచి ఏప్రిల్ ఒకటో తేదీ వరకు ఒంగోలు ఆర్ఐఈసీఈ కళాశాలలో జేయన్‌టీయూకే, కాకినాడ సెంట్రల్ జోన్ బాస్కెట్‌బాల్ పోటీలు జరిగాయని పేర్కొన్నారు. ప్రతిభ కనబర్చిన క్రీడామణులను, ఫిజికల్ డైరెక్టర్స్‌ను కళాశాల ప్రెసిడెంట్ జి.శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కే. హరినాథరెడ్డి అభినందించారు.

13న సాంకేతిక ఉత్సవం

తిరువూరు: స్థానిక వాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 13న సాంకేతిక, సాంస్కృతిక ఉత్సవం నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఆర్ నాగేంద్రబాబు తెలిపారు. వివిధ కళాశాలల నుంచి విచ్చేసే విద్యార్థులు పేపర్ ప్రజెంటేషన్, ప్రాజెక్ట్ ఎక్స్‌పో, పోస్టర్ ప్రజెంటేషన్ తదితర పోటీలలో పాల్గొంటారని పేర్కొన్నారు. విద్యార్థులకు స్లో సైక్లింగ్, విద్యార్థినులకు మ్యూజికల్ చైర్స్ పోటీలను కూడా నిర్వహిస్తామని తెలిపారు.

ఆటిజంపై అవగాహన పెంపొందించుకోవాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతి ఒక్కరూ ఆటిజంపై అవగాహన పెంపొందించుకోవాలని దీన్ని ఆరంభ దశలోనే గుర్తించి చికిత్స ఇస్తే మంచి ఫలితాలు పొందే అవకాశం ఉందని చేయూత మానసిక దివ్యాంగుల శిక్షణ సంస్థ డైరెక్టర్ డాక్టర్ టి.కృష్ణకుమారి అన్నారు. అయోధ్యనగర్ లోటస్ ల్యాండ్ మార్క్‌లోని చేయూత మానసిక దివ్యాంగుల శిక్షణ సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రపంచ ఆటిజం డే సందర్భంగా అవగాహన కార్యక్రమం జరిగింది. ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు చిన్నారులను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలన్నారు. చిన్నారులు పిలిచినా పలకక పోవటం, అందరిలో కలవక పోవటం, చెప్పినవి అర్థం చేసుకోకపోవటం వంటి లక్షణాలు కనిపిస్తే వైద్యులను సంప్రదించాలన్నారు. దివ్యాంగులైన పిల్లల ఆధార్‌కార్డు, సదరం సర్టిఫికెట్ తదితర పత్రాలను ఎలా తీసుకోవాలో తెలియ చేశారు. దీనిపై ఇబ్బందులు ఉంటే స్పందనలో వినతి పత్రాలు అందజేయవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారుల తల్లిదండ్రులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో చేయూత మానసిక దివ్యాంగుల శిక్షణ సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షంతో రైతులకు నష్టం



కిలేశపురంలో నేలవాలిన మొక్కజొన్న పంటను చూపిస్తున్న రైతు



త్రిలోచనాపురంలో గాలివానకు దెబ్బతిన్న అరటి తోట

ఇబ్రహీంపట్నం: ఈదురు గాలులు, అకాల వర్షంతో రైతులు అపారనష్టానికి గురయ్యారు. ఆదివారం సాయంత్రం ఉరుములు మెరుపులు, ఈదురు గాలులతోపాటు ఏకధాటిగా కురిసిన వర్షంతో మొక్కజొన్న, అరటి తోటలు దెబ్బతిన్నాయి. త్రిలోచనాపురం, జూపూడి, ఇబ్రహీంపట్నం, కిలేశపురం, లంక గ్రామాల్లో సుమారు 100 ఎకరాల్లో మొక్కజొన్న, 40 ఎకరాల్లో అరటితోటలు దెబ్బతిన్నాయి. అరటి తోటలకు ఇప్పటికే ఎకరాకు రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టినట్లు మురళి అనే రైతు తెలిపారు. మొక్కజొన్న పైరు కండెలు పాలుపోసుకునే దశలో ఉన్నాయి. గాలివాన రూపంలో తుడుచుపెట్టుకు పోయిందని రైతులు వాపోతున్నారు. ఎకరాకు ఇప్పటి వరకు రూ.35వేలు వరకు పెట్టుబడి పెట్టారు. రైతుల ద్వారా సమాచారం అందుకున్న మండల వ్యవసాయ శాఖ అధికారి డి.శైలజ సచివాలయ వ్యవసాయ అసిస్టెంట్‌లతో నేలవాలిన పంటలపై సర్వే చేయించారు. పంటల నివేదిక జిల్లా ఉన్నతాధికారులకు పంపిస్తామని పేర్కొన్నారు.

చిరుధాన్యాలు ఆహారంగా తీసుకోవాలి



హెల్దీ బేబీ షోలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్



ముసునూరులో ఆరోగ్య అవగాహన సదస్సు

నూజివీడు: గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారం అందినప్పుడే ఆరోగ్యంగా ఉంటారని, చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవడం అలవర్చుకోవాలని సబ్ కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్ అన్నారు. పోషణ్ పక్వాడా పక్షోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన హెల్దీ బేబీ షో లో గెలుపొందిన వారికి సోమవారం సబ్‌కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. మొదటి బహుమతిని నందనంతోటకు చెందిన తిరుమలశెట్టి నిర్గుణసాయి, ద్వితీయ బహుమతిని అజరయ్యపేటకు చెందిన చప్పిడి గౌతమ్ గెలుచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతా శిశు మరణాలను నిర్మూలించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలను అమలు చేస్తూ పౌష్టికాహారాన్ని అందజేస్తున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ ఐదేళ్ల లోపు పిల్లలను తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రానికి పంపించాలన్నారు.

పోషకాహారంతోనే రక్తహీనత దూరం

ముసునూరు: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు అంగన్‌వాడీల ద్వారా అందుతున్న పోషకాహారంతో బలాన్ని పొంది రక్తహీనతను తరిమి వేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ధనలక్ష్మి, శ్రీలక్ష్మి పిలుపునిచ్చారు. పోషణ పక్వాడ్ పక్షోత్సవాల ముగింపు సందర్భంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం మండల వ్యాప్తంగా గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అవసరాలు, తయారు చేసుకునే విధానం అనే అంశాలపై అవగాహన సదస్సులు నిర్వహించి, వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు.

సేంద్రియ కూరగాయల విక్రయం

విస్సన్నపేట: ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సేంద్రియ పద్ధతుల్లో పండించిన కూరగాయలను సోమవారం విక్రయించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సేంద్రియ ఎరువులతో పండించిన కూరగాయల విక్రయాలను ఏఓ రాజ్యలక్ష్మీ సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో జీరో బడ్జెట్ నేషనల్ ఫార్మింగ్ ఐసీఆర్పీలు సీఎస్ రెడ్డి, పవన్, కృష్ణకుమారి పాల్గొన్నారు.